ఆ కాలువ కథేమిటి!



సర్వే నంబర్ 1130లో తవ్విన కాలువ



నిలిచిపోయిన కాలువ తవ్వకం పనులు

- బాల్కొండలోని సాయికుంట, నాగులకుంట అనుసంధాన కాలువ కబ్జా
- తిరిగి తవ్వించిన అధికారులు
- కొంతమేర భూసేకరణ జరగలేదంటున్న అధికారులు

బాల్కొండ: మండల కేంద్రంలోని సాయికుంట, నాగులకుంటను అనుసంధానం చేస్తూ తవ్విన కాలువ అసలు కథ ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలోని సర్వే నంబరు 1130, 1131 భూముల్లో గతంలోనే కాలువను తవ్వారు. అయితే సర్వే నంబరు 1130 పరిధిలోని భూమిలో నుంచి ఉన్న కాలువను కబ్జా చేసి కొందరు నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించారు. దీంతో మైనర్ ఇరిగేషన్ బాల్కొండ అధికారులు కబ్జా చేసిన కాలువను ప్రొక్లెయిన్‌తో తవ్వించారు. కానీ సర్వే నంబరు 1131 వరకు రాగానే కాలువ పూడిక తవ్వకాన్ని నిలిపి వేశారు. అసలు కాలువ నిర్మాణం చేపట్టినప్పుడే ఎక్కడి వరకు కాలువ అవసరం ఉంటుందో అక్కడి వరకు భూమి సేకరిస్తారు. కానీ సర్వే నంబరు 1131 పరిధిలో సుమారు 200 మీటర్ల పొడవు కాలువ కోసం భూ సేకరణ చేపట్టలేదని అధికారులు తెలుపుతున్నారు. కాలువ తవ్వకం చేపట్టాల్సిన చోట వెంచర్ ఏర్పాటు చేశారు. కాలువ తవ్వకం కోసం భూమిని సేకరించారా? లేదా? వెంచర్‌కు నష్టం వాటిల్లుతుందని అధికారులు వెనుకడుగు వేస్తున్నారా? అని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రెండు సర్వే నంబర్లలో భూమిని కోల్పోయిన వారు.. ఇప్పటి వరకు తమకు నష్టపరిహారం అందలేదంటున్నారు. బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండాపోయింది. దీంతో జాగా కనిపిస్తే పాగా వేస్తున్నారు. 1131 సర్వే నంబర్‌లో భూ సేకరణ చేపట్టినట్లు రెవెన్యూ కార్యాలయంలో సైతం అవార్డు కాపీలు లేవంటున్నారు. అంతే కాకుండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సంబంధిత అధికారులను అడిగితే.. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి రెవెన్యూ అధికారులు అవార్డు కాపీల కోసం లేఖలు రాసినట్లు తెలిసింది. భూమిని కోల్పోతున్న వారికి పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందించాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉంది. భూ సేకరణ జరగలేదని, కాలువ తవ్వకాన్ని మధ్యలో నిలిపివేస్తే నీటి సరఫరా సంగతి ఏమిటనేది అధికారులకే తెలియాలి. ఉన్నతాధికారులు స్పందించి కాలువ కథకు ముగింపు పలకాలని స్థానికులు కోరుతున్నారు.

భూసేకరణ చేపట్టలేదు

సాయికుంట, నాగులకుంట నీటిని అనుసంధానం చేస్తూ కాలువ తవ్వకం కోసం సుమారు 200 మీటర్ల పొడవు భూ సేకరణ చేపట్టలేదు. కాలువ తవ్వకం నిలిపివేశాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. – సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

క్లుప్తంగా

పక్కాప్రణాళిక ఉండాలి



బాల్కొండ: గ్రామాల అభివృద్ధి కోసం పక్కా ప్రణాళిక ఉండాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బూస సునీత అధ్యక్షతన జీపీ డెవలప్‌మెంట్ గ్రామసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఏడాది కాలంలో చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళిక పక్కాగా ఉండాలన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ వాహబ్, ఈవో రజనీకాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



వర్ని (చందూర్): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ సభ్యులతోపాటు అధికారులదేనని చందూర్ ఎంపీడీవో లీలావతి అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్‌లో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమావేశాన్ని సర్పంచ్ సత్యనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధిని ప్రజలకు కల్పించాలని, ఆరోగ్యకరమైన పంచాయతీగా మార్చాలని, తాగు, సాగునీరు, మౌళిక సదుపాయాలు కల్పించాలని సమావేశంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్విని, ఎంపీవో చందర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను అందించాలి



బాల్కొండ: 2022–23 సంవత్సరంలో ఖరీఫ్, రబీకి సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను రైస్ మిల్లుల యజమానులు ప్రభుత్వానికి వెంటనే అందించాలని బాల్కొండ తహసీల్దార్ శ్రీధర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నాగాపూర్, కిసాన్‌నగర్‌లో రైస్ మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైస్‌మిల్లుల యజమానులతో మాట్లాడుతూ.. కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను గడువులోగా అందించని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్‌ఐ రాఘవేందర్ తదితరులున్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబురాలు



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో సంక్రాంతి సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించి సంక్రాంతి విశిష్టతను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తిచేయాలి



ఆర్మూర్‌టౌన్: ఈనెల 31వ తేదీలోగా రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీని పూర్తిచేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో గురువారం మండలంలోని రేషన్‌షాప్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 72శాతం ఈకేవైసీ పూర్తయ్యిందన్నారు. మిగిలిన వారు కూడా ఈకేవైసీని పూర్తి చేయాలన్నారు. రేషన్‌దుకాణాల వారీగా విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేసుకొని ప్రతినెలా సమావేశాలు నిర్వహించాలని, రేషన్ దుకాణాల్లో సమయ పాలన పాటించాలన్నారు. మృతి చెందిన రేషన్ లబ్ధిదారుల వివరాలను అందజేయాలన్నారు. నాయబ్ తహసీల్దార్ విజయ్ కాంత్‌రావు, ఆర్‌ఐ అశోక్ సింగ్, జూనియర్ సహాయకులు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్లకు చెందిన నాగబోయి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలోపడింది. విషయం తెలుసుకున్న మృతుడి చిన్ననాటి స్నేహితులు బాధిత కుటుంబానికి గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. తమ మిత్రుడిని కోల్పోవడం బాధగా ఉందని, బాధిత కుటుంబానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. గంగారాం, రాజు, బీరప్ప, సాయిబాబు, జగన్, మల్లుగొండ, శ్రీను, నాగేశ్, శంకరప్ప పాల్గొన్నారు.

వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు



మాట్లాడుతున్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన్న

పెర్కిట్(ఆర్మూర్): కుటుంబంలో ప్రాధాన్యత ఇవ్వకుండా వయో వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే చట్ట పరమైన చర్యలుంటాయని రాష్ట్ర సీనియర్ సిటిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్, జాతీయ కార్యవర్గ సభ్యుడు భూమన్న అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లిలో గురువారం అనంత ఆంజనేయ స్వామి సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి భూమన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 60 ఏళ్లు నిండిన వారు కులమతాలకు అతీతంగా అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని ఐక్యంగా ఉండాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని, పరిష్కరిస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజా రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం ద్వారా పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు, పేద వృద్ధులకు చేతి కర్రలు అందజేయడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మామిడిపల్లి సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ముత్యాల పోశెట్టి, ఉపాధ్యక్షుడిగా పవన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నడ్పి మల్లయ్య, సంయుక్త కార్యదర్శిగా బి.సాయిలు, కోశాధికారిగా లక్కారం పోశెట్టి ఎన్నికయ్యారు. నూతన అసోసియేషన్‌కు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు రవిగౌడ్ రూ.21 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి విజయ్‌కుమార్, పట్టణ శాఖ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ వర్మ, బంది సాయన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో టీపీయూఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాంప్లెక్స్ హెచ్‌ఎం గంగారాం గురువారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీయూఎస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, జిల్లా బాధ్యులు కనకాద్రి, రుద్ర మధుసూదన్, మండల బాధ్యులు విజయానంద్, హన్మాండ్లు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్



వివరాల నమోదును పరిశీలిస్తున్న వాజిద్ హుస్సేన్

బోధన్‌రూరల్(బోధన్): పంటలు సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, లాభాలు పొందేందుకు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. బోధన్ మండలంలోని బెల్లాల్‌లో పంటపొలాలను గురువారం ఆయన సందర్శించారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాల నమోదు ప్రక్రియను సర్వే నంబర్ల వారీగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, అవసరం మేరకు అందిస్తామన్నారు. ఆయన వెంట ఏఈవో గంగజాల, రైతులు ఉన్నారు

వేగంగా సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో సమీకృత వెజిటెబుల్ మార్కెట్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గత టీఆర్ఎస్ ప్రభుత్వం సమీకృత వెజిటెబుల్ మార్కెట్ నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. గతేడాది జనవరిలో నిర్మాణ పనులను ప్రారంభించారు. బల్దియా అధికారులు నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన అందుబాటులోకి తీసుకు రావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



వన్నెల్(బి)లో నివాళులు అర్పిస్తున్న అభిమానులు



బోధన్ మండలం పెంటాకుర్దులో..

బోధన్‌రూరల్/బోధన్‌టౌన్/వర్ని/బాల్కొండ/మాక్లూర్/రుద్రూర్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాక్లూర్ మండలం కొత్తపల్లి, వర్ని మండల కేంద్రంతోపాటు శ్రీనగర్, బాల్కొండ మండలం వన్నెల్(బి), కోటగిరి మండలం మిర్జాపూర్, బోధన్ మండలం పెంటాకుర్దు, జాడిజమల్‌పూర్, ఎరాజ్‌పల్లి తదితర గ్రామాలలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. బోధన్ పట్టణంలో కమ్మ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.



వర్ని మండలం శ్రీనగర్‌లో..



బోధన్‌లోని కమ్మ సంఘంలో..

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వర్ని/బాల్కొండ/రుద్రూర్ : చందూర్, బాల్కొండ, రుద్రూర్ మండల కేంద్రాల్లోని మైనార్టీ గురుకుల పాఠశాల/కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు నరేశ్, వాణి, మహ్మద్ ముబీన్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మైనార్టీ విద్యార్థులకు 'ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్' ప్రాతిపదికన సీట్ల కేటాయింపు ఉంటుందని, మిగతా వారికి లక్కీడ్రా పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

కాలనీ కమిటీ ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని విద్యానగర్ కాలనీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా యామాద్రి భాస్కర్, ప్రధానకార్యదర్శిగా పృథ్వీరాజ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా వి.రాము, భూమేశ్వర్, కోశాధికారిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా విద్యాసాగర్, గోవర్ధన్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

కేదారేశ్వర ఆశ్రమాన్ని సందర్శించిన ముథోల్ ఎమ్మెల్యే



నందిపేట్: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమాన్ని నిర్మల్ జిల్లా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ గురువారం సందర్శించారు. ఆశ్రమం ఆవరణలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్‌ని సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనవెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మాక్లూర్: మండలంలోని కల్లెడిలో ఇటీవల కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడు హర్షవర్ధన్ కుటుంబాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకుడు ప్రణయ్, గ్రామస్తులున్నారు.

ఆర్థికసాయం అందజేత

నిజామాబాద్‌నాగారం: కోటగల్లీకి చెందిన నిరుపేదైన లింబాద్రి రవి ఇటీవల జరిగిన ఓ ప్రమాదంతో కోమాలోకి వెళ్లాడు. ప్రస్తుతం అతడికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈక్రమంలో బాధిత కుటుంబానికి గురువారం శ్రీలక్ష్మీచేయూత సేవా సమితి సభ్యులు రూ.6వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు వంగల రమణాచారి, కోశాధికారి భూషణ్ చారి, లక్ష్మణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



హసాకొత్తూర్‌లో బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ

కమ్మర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అర్వింద్ అన్నారు. మండలంలోని హాసాకొత్తూర్‌లో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముద్ర రుణాలు, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య బీమా, ఆవాస్‌యోజన, పీఎం కిసాన్, ఉజ్వల గ్యాస్ సిలిండర్లు తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ ముద్రించిన క్యాలెండర్, బ్రోచర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, జాతీయ సమాచార అధికారి, ఏడీఏ మల్లయ్య, ఐకేపీ ఏపీఎం కుంట గంగారెడ్డి, సర్పంచ్ ఏనుగు పద్మ, ఉప సర్పంచ్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బొంకన్‌పల్లిలో..

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. ఎంపీడీవో జె క్రాంతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీ పూజిత, ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, ఐకేపీ ఏపీఎం అనిల్‌కుమార్, ఉపాధి హామీ ఏపీవో ఓంకార్, నాయకులు రమణారావు, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనంతరం ధర్మోరా చెరువును ఆధారంగా చేసుకొని కొనసాగుతున్న ముల్లంగి (బి), బొంకన్‌పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను విఠల్‌రావు పరిశీలించారు.

మహిపాల్‌రెడ్డి స్ఫూర్తిని కొనసాగిస్తాం



మామిడిపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీ అర్వింద్, మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, నాయకులు

పెర్కిట్(ఆర్మూర్)/కమ్మర్‌పల్లి: రాజకీయాల్లో దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి ఏలేటి మహిపాల్‌రెడ్డి స్ఫూర్తిని కొనసాగిస్తామని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మహిపాల్‌రెడ్డి వర్ధంతిని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో గురువారం నిర్వహించారు. మామిడిపల్లిలోని మహిపాల్‌రెడ్డి విగ్రహానికి ఎంపీతోపాటు మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిపాల్‌రెడ్డి రాజకీయ జీవితం నేటితరం నాయకులకు ఆదర్శమన్నారు. చౌట్‌పల్లిలో మహిపాల్‌రెడ్డి సమాధివద్ద ఆయన సతీమణి అన్నపూర్ణమ్మ, కొడుకు మహిపాల్‌రెడ్డితోపాటు ఎంపీ నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, నాయకులు నూతుల శ్రీనివాస్ రెడ్డి, యమాద్రి భాస్కర్, జెస్సు అనిల్, ఆకుల రాజు, పాన్ శ్రీను, మల్కన్నగారి మోహన్, నిమ్మల శ్రీనివాస్, బజరంగ్, మారంపల్లి గంగాధర్, సురేందర్, కమ్మర్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు కట్ట సంజీవ్, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకుసాగాలని ఏబీవీపీ ఇందూర్ అధ్యక్షుడు వెంకటకృష్ణ అన్నారు. పట్టణంలోని ఓ కళాశాలలో ఏబీవీపీ నాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి వివేకానంద 161 జయంతి సందర్భంగా యువజనోత్సవాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని, క్రీడా సమ్మేళనంలో ఆర్మూర్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్, ఒకేషనల్, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్‌ను పున:నిర్మించాలి



రాణంపల్లి క్యాంపు వద్ద శిథిలావస్థలో ఉన్న బస్‌షెల్టర్

రుద్రూర్: మండలంలోని రాణంపల్లి క్యాంపు వద్ద శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్‌ను తొలగించి పున:నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాలకు వెళ్లే రాణంపల్లి గ్రామస్తులు ఇక్కడే బస్సెక్కుతారు. వారిని దృష్టిలో ఉంచుకొని క్యాంపు వద్ద గతంలో బస్‌షెల్టర్ నిర్మించారు. ఇటీవల చేపట్టిన రోడ్డును విస్తరించడంతో బస్‌షెల్టర్ దిగువకు అయ్యి శిథిలావస్థకు చేరింది. వానకాలంలో నీరు నిలువడంతోపాటు పిచ్చి మొక్కలు పెరుగుతాయి. బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు పక్కన నిల్చుంటున్నారు. ఆర్టీసీ సంస్థ లేదా స్వచ్ఛంద సంస్థలు స్పందించి ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో గ్రామస్తులు గురువారం పూజలు నిర్వహించారు. నూతనంగా గుడి నిర్మించి మండల పూజ పూర్తి చేసుకున్న సందర్భంగా గణపతి పూజ, దేవతాభిషేకం చేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ముదిరాజ్ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – గుంటూరు కారం (తెలుగు)- 9.40 సైంధవ్ (తెలుగు)- 1.00, 7.05, 10.05 హనుమాన్ (తెలుగు) 4.00
- స్క్రీన్-2 – హనుమాన్ (తెలుగు)- 9.00 గుంటూరుకారం 12.20, 3.40, 7.00, 10.20
- స్క్రీన్-3 – హనుమాన్ (తెలుగు)- 9.10, 12.30, 3.50, 7.25, నా సామిరంగ (తెలుగు) 10.45
- స్క్రీన్-4 – నా సామిరంగ (తెలుగు)- 10.20, 1.30, 4.40, 7.50 హనుమాన్ (తెలుగు) - 11.00